
హైటెక్‌సిటీ ఆర్వోబీ వద్ద ఇలా..




కూకట్‌పల్లిలోని ఎల్లమ్మ బండ రోడ్డులో ఇలా..


మూసాపేట్‌లోని మైసమ్మ చెరువులో రసాయన వ్యర్థాలు చేరడంతో నురుగై పారుతున్న వరద


వి.రామారావు నగర్‌లో ఇళ్ల మధ్యన ఉన్న నాలాలో నిండిన వర్షపు నీరు


రాజీవ్‌గాంధీనగర్‌లో ఓ ఇంటిలోకి చేరిన వర్షపు నీరు




అలుగు పారుతున్న మైసమ్మ చెరువు


కూకట్‌పల్లి ఐడీఎల్(రంగధాముని) అలుగు పారుతున్న దృశ్యం

ప్రజల ప్రాణాలు, ఆస్తులకు
భద్రత కల్పించాలి


బబ్బుగూడలో వర్షానికి కూలిన ఇంటిని పూర్తిగా నేలమట్టం చేసిన అధికారులు

- వర్షాల కారణంగా ముందస్తు చర్యలు తీసుకోవాలి
- వరద రక్షణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాల
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


బబ్బుగూడలో కూలిన ఇంటి దృశ్యాలు


బబ్బుగూడలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, తదితరులు


దీన్‌దయాల్ నగర్‌లో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌తో కలిసి పర్యటిస్తూ స్థానికులతో మాట్లాడుతున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

బాలానగర్/మోతీనగర్: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో మూసాపేట సర్కిల్‌లోని ఫతేనగర్ డివిజన్ పరిధిలోని దీన్‌దయాల్ నగర్ భరత్‌నగర్ నాలా పరిసర ప్రాంతాల్లో రహదారులు పూర్తిగా జలమయమయ్యాయి. మూడు రోజుల పాటు భారీ వర్షాలున్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను అప్రమత్తం చేశారు. ఫతేనగర్ డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో జన జీవనం స్తంభించిందని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. శుక్రవారం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని దీన్‌దయాల్‌నగర్, భరత్‌నగర్ ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. వర్షాలతో ఇబ్బందులపై జీహెచ్‌ఎంసీ, జలమండలి, ట్రాఫిక్ పోలీస్ అధికారులతో చర్చించి, చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు భద్రత కల్పించడానికి విస్తృతమైన వరద రక్షణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

పాత ఇళ్లలో ఉంటున్న వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి..

అకాల వర్షాలు కురుస్తున్నందును పురాతన ఇళ్లలో నివసిస్తున్న వారు సురక్షిత ప్రాంతాలకు, తెలిసిన వారి బంధువుల ఇళ్లకు వెళ్లాలని ఎమ్మెల్యే కృష్ణారావు పేర్కొన్నారు. నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా మూసాపేట డివిజన్ బబ్బుగూడలో గణేష్, అనురాధల పురాతన ఇళ్లు కూలిపోయింది. విషయం తెలుసుకున్న ఆయన శుక్రవారం ఇంటిని పరిశీలించి పరామర్శించారు. ఈ కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న గృహలక్ష్మీ పథకం కింద నిధులు మంజూరు అయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు. వర్షాల కారణంగా అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. నిరంతరం అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని సూచించారు. అదే విధంగా నాలాలు, చెరువులు, కుంటల ప్రాంతాల వద్దకు ఎవరూ వెళ్లవద్దని తెలిపారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా స్థానిక అధికారులకు, తనకు గాని సమాచారం అందించాలని సూచించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో అకాల వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ రమేష్, నారాయణ, డీఈ శ్రీదేవి, కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, శ్రావణ్‌కుమార్, సురేష్, వేణు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పరికి చెరువు నాలాలో పిచ్చిమొక్కల తొలగింపు


పరికి చెరువు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించిన సిబ్బంది

ఆల్విన్‌కాలనీ: పరికి చెరువు నాలా ఉధృతంగా ప్రవహిస్తూ ఇళ్లలోకి నీరు చేరుతుండటంతో స్థానిక కాలనీవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు శుక్రవారం స్పందించి నాలాలో పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించారు. నాలాలో నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు చేపట్టారు. కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్‌కాలనీ, ధరణీనగర్ పరికి చెరువు నాలా 3రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పరికి చెరువు నాలా గుండా వెలువడే రసాయన వ్యర్థ జలాలు, చెట్ల పొదల నుంచి విష సర్పాలు వస్తున్నాయి. దీంతో నాలా ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాన్ని జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, స్థానిక సంక్షేమ సంఘ సభ్యులతో కలిసి పరిశీలించి స్థానిక ప్రజలకు ఇబ్బంది లేకుండా అల్లుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగింపచేశారు.

రోడ్డుపై ఎక్కడ గొయ్యి ఉందో.. ఎక్కడ మ్యాన్‌హోల్ ఉందో?

ఓల్డ్ బోయిన్‌పల్లి: నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని అయా ప్రాంతాల రహదారులు జలమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం సాయంత్రం కురిసిన భారీవర్షం కారణంగా పలుప్రాంతాల్లో వర్షపు నీరు ప్రధాన రోడ్లు కాలనీలలోని రోడ్లు చిన్నపాటి చెరువును తలపించాయి. సిండికేట్ బ్యాంక్ కాలనీ, బృందావన్ కాలనీ, మానస సరోవర్ హైట్స్, కల్యాణ్ థియోటర్ ముందు, కళింగ ఎన్‌క్లేవ్, శ్రీ సాయి ఎన్‌క్లేవ్, హస్మత్‌పేట, అంజయ్యనగర్ ప్రాంతాలలో రహదారులు నీట మునిగాయి. అపార్టుమెట్ల సెల్లారులోకి నీరు చేరడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. రోడ్డుపై ఎక్కడ గొయ్యి ఉందో.. ఎక్కడ మ్యాన్‌హోల్ ఉందో? తెలీక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వరద నీరు నిలిచిన ప్రాంతాలలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కన్నె ప్రకాశ్ పర్యాటించారు. మానస సరోవర్ హైట్స్ వద్ద వరద నీటిలో చిక్కుకుపోయిన వృద్ధులను క్షేమంగా ఇంటికి చేర్చారు.


మానస సరోవర్ హైట్స్ వద్ద వరదలో చిక్కుకున్న వృద్ధులను బయటకు తీసుకొస్తున్న బీజేవైఎం నేతలు


సిండికేట్ బ్యాంక్ కాలనీలోని ఓ అపార్టుమెంట్ సెల్లార్ నుంచి మోటర్లతో నీటిని బయటకు తొడుతూ..



కల్యాణ్ థియోటర్ ముందు రోడ్డులో చిన్న పాటి చెరువును తలపిస్తున్న వరద నీరు


సిండికేట్ బ్యాంక్ కాలనీలో చేరిన వరద నీరు

మ్యాన్‌హోల్‌లో పూడికను తొలగించాలి

కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు


భాగ్యనగర్‌కాలనీలో ఏర్పడిన డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన భాగ్యనగర్ కాలనీ కేపీ బేకరీ రోడ్డులో తలెత్తిన డ్రైనేజి సమస్యను జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యను బకెట్ క్లీనింగ్ చేపట్టి మ్యాన్‌హోల్‌లో పేరుకుపోయిన పూడికను తీయాలన్నారు. అదేవిధంగా డ్రైనేజీ నీరు సాఫీగా సాగేలా చూడాలన్నారు. ప్రతి మ్యాన్‌హోల్ వద్ద పూడిక తీసి చెత్తా చెదారాన్ని తొలగించాలని సూచించారు. ఎక్కడా డ్రైనేజి సమస్య ఉందో అక్కడ బకెట్ క్లీనింగ్ చేపట్టి సమస్యను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఎప్పుడు ప్రజలందరికి అందుబాటులో ఉంటూ ఎటువంటి సమస్య వచ్చినా పరిష్కరిస్తానని తెలిపారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రశాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, సూపర్‌వైజర్ నరేంద్ర, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సఫ్దార్‌నగర్‌లోని పబ్లిక్ హైస్కూల్‌లో పునరావాస కేంద్రం


వరద ముంపు ప్రాంతంలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సబిహాబేగం తదితరులు

మోతీనగర్: వర్షాలకు ముంపునకు గురైన సఫ్దార్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్, రామారావునగర్‌లలో శుక్రవారం కార్పొరేటర్ సబిహా బేగం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె లోతట్టు ప్రాంతవాసుల సమస్యలను తెలుసుకున్నారు. పురాతన ఇళ్లల్లో నివాసం ఉంటున్న వారికి పునరావాస కేంద్రాన్ని సఫ్దార్ నగర్‌లోని పబ్లిక్ హైస్కూలులో ఏర్పాటు చేశామన్నారు. భోజన వసతి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భారీ వర్ష సూచన నేపథ్యంలో అధికారులందరూ అప్రతమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వరద నీరు నిలవకుండా చూడాలన్నారు. భారీ వర్షాలను ఎదుర్కొనేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసుకుని సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఏ సమస్య ఉన్నా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్



ఎల్లమ్మబండలో వర్షపు నీటిని తొలగింప చేయిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో పలు ప్రాంతాల్లో రోడ్డుపై నిలిచిన వరద నీటిని జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తొలగింపజేశారు. అదే విధంగా రాఘవేంద్రనగర్ కాలనీలో వంతెన వద్ద అడ్డుపడిందన్న సమాచారం అందుకున్న ఆయన వెంటనే జీహెచ్‌ఎంసీ సిబ్బందితో అక్కడకు వెళ్లి చెట్టును తొలగింపజేయించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ప్రజలకు సూచించారు. లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజేష్ చంద్ర, శివరాజ్ గౌడ్, షౌకత్ అలీ మున్నా, వాసుదేవరావు, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో ఆహార ప్యాకెట్ల పంపిణీ

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని సఫ్దార్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్‌లోని వరదనీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం వారికి కాంగ్రెస్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు మంచినీరు, భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్ర, సయీద్ మిస్బా, షఫీయుద్దీన్, సుధాకర్‌రెడ్డి, సుల్తాన్, ఇలియాస్, వాజిద్, నసీర్, ఫిరోజ్, ఇస్మాయిల్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.


అల్లాపూర్ డివిజన్‌లో నీటిలో చిక్కుకున్న వారికి భోజనం అందజేసిన గొట్టిముక్కల వెంగళరావు

రూ.10 వేల ఆర్థిక సాయం..

కూకట్‌పల్లి: నియోజకవర్గంలోని మూసాపేట డివిజన్‌లోని బబ్బుగూడ ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు గణేష్, అనురాధలకు చెందిన నివాస గృహం కూలిపోయింది. దీంతో తీవ్ర అవస్థలకు గురయ్యారు. విషయం తెలుసుకున్న కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు శుక్రవారం నివాసానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. అనంతరం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న గొట్టిముక్కల వెంగళరావు

హ్యాండ్లూమ్ హ్యాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభం



భాగ్యనగర్‌కాలనీ: చేనేతకు చేయూతనిద్దాం... మన సంప్రదాయాన్ని కాపాడుకుందాం... అనే నినాదంతో హెచ్‌ఎంటీ హిల్స్ రామాలయం ఎదురుగా కమ్యూనిటీహాల్‌లో హ్యాండ్లూమ్ సిల్క్ ఎక్స్‌పో సొసైటీ ఆధ్వర్యంలో హ్యాండ్లూమ్ హ్యాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో చేనేత కళాకారులు స్వయంగా తయారు చేసిన వస్తువులతో పాటు చేనేత, పోచంపల్లి, ఇక్కత్, భగల్పూర్ జాంధాన్ని, బెంగాలీ కాటన్, ఉప్పాడ, వెంకటగిరి, ధర్మవరం సిల్క్ శారీలు, హ్యాండీక్రాఫ్ట్ వస్తువులు, ఖాదీ క్లాత్, వరంగల్ చేనేత టవల్స్, కాశ్మీర్ సిల్క్ చీరలు, జైపూర్ కాటన్ స్కర్ట్‌లు, జ్యూట్ బ్యాగులు, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీతో పాటు జైపూర్ పాన్ మసాలా, తినుబండారాలు నోరూరిస్తాయని నిర్వాహకులు వికాస్ జైన్ తెలిపారు. ఈ మేళా ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉంటుందని తెలిపారు.

రేపు 'గుప్పెడు మనసు' పుస్తకావిష్కరణ

మోతీనగర్: తెలుగు భాషా వికాస సమితిఆధ్వర్యంలో గుడివాడలో ఈనెల 23వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలకు వాసవీ చౌక్‌లోని ఆర్యవైశ్య కల్యాణ మండపం వేదికలో ప్రముఖ రచయిత్రి యలమర్తి అనురాధ 'గుప్పెడు మనసు'కథా సంపుటిని ఆవిష్కరించనున్నట్లు సంస్థ సమన్వయ కర్త డీఆర్‌బీ ప్రసాద్ తెలిపారు.ఈ కార్యక్రమానికి సాహితీవేత్తలు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

అప్పులు తీర్చలేక యువకుడు ఆత్మహత్య



భాగ్యనగర్‌కాలనీ: అప్పులు బాధ తాళలేక ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేటలోని జనతానగర్‌లో నివాసం ఉంటున్న గోకర్ణ వేణు (24) సేల్స్‌మెన్‌గా పనిచేస్తు జీవనం కొనసాగిస్తున్నాడు. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నాడు. జులై 2న వేణు కుమారుని పుట్టిన రోజు సందర్భంగా సొంత ఊరైన శ్రీకాకుళంలోని బంజెరి గ్రామానికి వెళ్లారు. తిరిగి వేణు ఒక్కడే తిరిగి వచ్చాడు. వచ్చిన తరువాత నాలుగు రోజుల పాటు జనతానగర్‌లోనే నివాసముండే తన బాబాయి ప్రకాష్ ఇంటికి భోజనం నిమిత్తం వెళ్లి వచ్చేవాడు. రెండు రోజులుగా వెళ్లలేదు. అయితే శుక్రవారం మధ్యాహ్న సమయంలో ఇంటికి రాకపోవటంతో అనుమానం వచ్చి ఇంటికి వెళ్లి చూడగా వేణు ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే మిత్రుల సాయంతో కిందకు దించి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. అప్పుడప్పుడు వేణు అప్పులు ఉన్నాయని చెప్పేవాడని.. వాటిని తీర్చలేక జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని బాబాయ్ ప్రకాష్‌తో పేర్కొన్నాడు. ఈ మేరకు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.